
సాక్షి నిర్మల్

గురువారం । 31 । జూలై । 2025



సమస్యల్లో కుభీర్ పీహెచ్‌సీ

కుభీర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సమస్యలకు నిలయంగా మారింది. కనీస వసతులు లేక రోగులు అవస్థలు పడుతున్నారు. 9లో▸



కేంద్రానిదే మెజార్టీ వాటా 9లో▸

బియ్యం మెజార్టీ వాటా కేంద్రానిదేనని ఎమ్మెల్యే రామారావు పటేల్ తెలిపారు. లబ్ధిదారులు వినియోగించుకోవాలని సూచించారు.

గరిష్ఠం/కనిష్ఠం
31.0 /24.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

సత్వర న్యాయం అందించాలి



సమస్యలు తెలుసుకుంటున్న జానకీ షర్మిల

భైంసాటౌన్: ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం అందేలా చూడాలని ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల సూచించారు. బుధవారం పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించి భైంసా డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. కుటుంబ వివాదాల పరిష్కారంలో భాగంగా ప్రతీ బుధవారం షీ టీం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ తీరు పరిశీలించారు. చిన్నచిన్న తగాదాలతో విడిపోతున్న కుటుంబాల ను కౌన్సెలింగ్‌తో కలపడంలో షీటీం పాత్ర అభినందనీయమని కొనియాడారు. ఏఎస్పీ అవినాష్ కుమార్, సీఐలు, ఎస్సైలు ఉన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి



విద్యార్థినులతో భోజనం చేస్తున్న శ్రీనివాస్

కుంటాల: విద్యార్థినులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ సూచించారు. బుధవారం మండలంలోని కల్లూరు కేజీబీవీని సందర్శించారు. విద్యార్థినులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. డీఎల్పీవో సుదర్శన్, ఎంపీవో ఎంఏ రహీంఖాన్, సిబ్బంది ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష

మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో డీపీవో శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. వనమహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించాలని సూచించారు. ఎంపీడీవో వనజ, ఎంపీవో ఎంఏ రహీంఖాన్, ఏపీవో నవీన్, ఏపీఎం అశోక్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రిజర్వేషన్లు కల్పించాలి



నియామక పత్రాలు ఇస్తున్న గజేందర్‌యాదవ్

నిర్మల్‌టౌన్: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని నవ సంఘర్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు అప్క గజేందర్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం నిర్మల్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రిజర్వేషన్ల కోసం బీసీలంతా ఏకం కావాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. అనంతరం సమితి జిల్లా అధికార ప్రతినిధిగా జుట్టు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా నర్సయ్య, సెక్రటరీగా ముండాల పోశెట్టి, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుని నియామక పత్రాలు అందజేశారు. జిల్లా అధ్యక్షుడు ఫిరోజ్, సయ్యద్ మక్బూల్ తదితరులు పాల్గొన్నారు.

సదర్మాట్‌కు నీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

ఖానాపూర్: మండలంలోని మేడంపల్లి గ్రామంలోని సదర్మాట్ ఆనకట్ట వద్ద బుధవారం ఆయకట్టు రైతులకు వానాకాలం సాగుకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు నీటిని పొదుపు వాడుకోవాలని సూచించారు. నాయకులు భూషణ్, ఎంఏ మజీద్, దయానంద్, సత్యం, రాజేందర్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకాగౌడ్, శంకర్, రాజేందర్, గంగాధర్, లచ్చన్న, శంకర్, గంగన్న, రవి, రాజన్న, అధికారులు పాల్గొన్నారు.

గడ్డెన్నవాగుకు ఇన్‌ఫ్లో

భైంసాటౌన్: ఎగువన కురిసిన వర్షాలకు గడ్డెన్నవాగు ప్రాజెక్ట్‌లోకి బుధవారం 1,042 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 358.70 మీటర్లు కాగా, ప్రస్తుతం 357.20 మీటర్ల నీరున్నట్లు పేర్కొన్నారు.

'కడెం'కు స్వల్పం..

కడెం: కడెం ప్రాజెక్ట్‌కు బుధవారం 2,306 క్యూసెక్కుల స్వల్ప ఇన్‌ఫ్లో వస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 695.175 అడుగులు ఉన్నట్లు పేర్కొన్నారు.

కాకతీయ.. ఇదేందయా?

- యూనివర్సిటీకి పట్టని జిల్లా
- కాలేజీ ఇక్కడ.. సార్లు అక్కడ
- కోర్సులనూ మార్చేసిన వైనం
- త్రిశంకుస్వర్గంలో పీజీ కళాశాల
- పట్టింపులేని పాలకులు, సార్లు
- విద్యార్థులకు అందని ఉన్నతవిద్య



జిల్లా కేంద్రంలోని పీజీ కళాశాల భవనం

నిర్మల్: ఎక్కడో వరంగల్‌లో ఉన్న కాకతీయ యూనివర్సిటీ జిల్లాకు దూరభారమే. అయినా.. ఆ వర్సిటీకి జిల్లాపై కాసింత దయ కూడా లేదు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతం.. అది కూడా చదువుల తల్లి కొలువైన జిల్లాపై చిన్నచూపు చూస్తోంది. ఈ ప్రాంత విద్యార్థుల ఉన్నత చదువుల ఆశలు చిదిమేస్తోంది. 'నీ జీవితానికి డిగ్రీ సరిపోతుందిలే. పీజీ సెంటర్ అవసరమా..!' అన్నట్లుగా వెక్కిరిస్తోంది. పీజీ సెంటర్‌ను పెంచాల్సింది పోయి, ఇక్కడున్న కోర్సులనే మాయం చేసింది. కాలేజీని ఉత్తభవనంగా మార్చేసి పీజీ సెంటర్‌ను త్రిశంకుస్వర్గంలో పెట్టింది. ఇక్కడి ప్రజల అమాయకత్వమా? నాయకుల అవగాహన లోపమా? లేక పాలకుల నిర్లక్ష్యమా? ఏదైతేనేం.. మొత్తానికి జిల్లాలోని విద్యార్థులను ఉన్నతవిద్యకు దూరం చేసింది.

1991లోనే పీజీ సెంటర్

చదువుల తల్లి కొలువుదీరి ఉన్నా.. విద్యాపరంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎంతో వెనుకబడి ఉండేది. పశ్చిమ ప్రాంతంలో ఆదిలాబాద్, నిర్మల్‌లోనే ప్రభుత్వ డిగ్రీ కాలేజీలుండేవి. ఆ తర్వాత పైచదువులంటే నిజామాబాద్‌కో లేదా హైదరాబాద్‌కో వెళ్లాల్సి వచ్చేది. అలా వెళ్లే స్థోమత లేని ఎంతోమంది ఉత్తమ విద్యార్థులూ డిగ్రీతోనే చదువులు ఆపేసిన దాఖలాలున్నాయి. ఈక్రమంలో అప్పటి పాలకుల విన్నపం మేరకు ప్రభుత్వం నిర్మల్‌లో కాకతీయ యూనివర్సిటీ అనుబంధంగా నిర్మల్‌లో 1991లో పీజీ సెంటర్‌ను ప్రారంభించింది. ఎంఏ సోషియాలజీ, ఇంగ్లిష్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ కోర్సులు ప్రవేశపెట్టారు. దీంతో ఈ ప్రాంత విద్యావ్యవస్థలో కొత్త దశ ప్రారంభమైంది. కానీ.. అది కొంతకాలమే అని అప్పట్లో స్థానికులు ఊహించలేకపోయారు.

కాలేజీ ఇక్కడ.. జీతాలక్కడ..

ప్రస్తుతం నిర్మల్ పీజీ కాలేజీలో సోషియాలజీ కోర్సు ఉన్నా.. అది సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సు కావడం, ఇక్కడ అధ్యాపకులూ లేకపోవడం, క్లాసులు జరగకపోవడంతో విద్యార్థులు చేరడం లేదు. తెలిసీతెలియక చేరే 10–15మందికి ఆన్‌లైన్ క్లాసులంటూ కాలం వెల్లదీస్తున్నారు. ఇప్పటికీ నిర్మల్ పీజీ కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపకుల పేరుమీదుగానే వర్సిటీలో ఉంటూ వేతనాలు తీసుకుంటున్నారు.

అమాయకత్వమా.. అవగాహన లోపమా?

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏకైక వర్సిటీ పీజీ సెంటర్ నాశనం కావడానికి స్థానిక ప్రజల అమాయకత్వంతోపాటు నాయకులు, పాలకుల అవగాహన లోపం, నిర్లక్ష్యం కూడా ఉన్నట్లు విద్యావంతులు ఆరోపిస్తున్నారు. కళ్ల ముందే కోర్సులన్నీ ఒక్కొక్కటిగా తరలిపోతూ చివరకు కాలేజీ భవనం మాత్రమే మిగలడాన్ని చూస్తూ ఉండిపోయారన్న వాదనలున్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు పట్టించుకుంటే జిల్లాకు ఉన్నతవిద్య అందుబాటులోకి వస్తుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

తిరిగి వర్సిటీ గూటికే..

నిర్మల్ పీజీసెంటర్‌లో రెగ్యులర్ పద్ధతిలో అసిస్టెంట్ ప్రొఫెసర్లను అప్పటి ప్రభుత్వం నియమించింది. వీరంతా స్థానికంగా ఉంటూ బాగానే పాఠాలు చెప్పారు. వర్సిటీ పరిధిలోనే ఎక్కడా లేని విధంగా ఇక్కడ సోషియాలజీ, ఇంగ్లిష్ సబ్జెక్టులు ఉండటంతో నల్గొండ, మహబూబ్‌నగర్ లాంటి దూర ప్రాంతాల నుంచి వచ్చి నిర్మల్ పీజీ సెంటర్‌లో విద్యార్థులు జాయిన్ అయ్యారు. ఇక్కడి అధ్యాపకులంతా వరంగల్, సమీప ప్రాంతాలకు చెందినవారే ఉండేవారు. కేయూ క్యాంపస్‌లో పనిచేసే ప్రొఫెసర్లు రిటైర్డ్ అవుతున్న కొద్దీ నిర్మల్‌లో ఉన్న ఎంఏ ఇంగ్లిష్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ రెగ్యులర్ ఫ్యాకల్టీ వరంగల్‌కు బదిలీ అయ్యారు. ఇక సోషియాలజీ కోర్సు క్యాంపస్‌లో లేకపోవడంతో ఇక్కడ పనిచేసే సదరు అధ్యాపకులకు ట్రాన్స్‌ఫర్ అయ్యే అవకాశం లేకుండా పోయింది. ఈక్రమంలోనే సోషియాలజీ ప్రొఫెసర్లంతా ఒక్కటై ఇక్కడున్న కోర్సును వరంగల్‌కు తరలించే కుట్ర చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈక్రమంలోనే ముందుగా హన్మకొండ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో సోషియాలజీ పీజీ కోర్సును సెల్ఫ్ ఫైనాన్స్ పద్ధతిలో ప్రారంభించారు. మూడేళ్ల తర్వాత ఆ సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సును రెగ్యులర్‌గా మార్చి, నిర్మల్ పీజీ సెంటర్‌లో ఉన్న రెగ్యులర్ కోర్సును సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుగా మార్చేశారు. నిబంధనల ప్రకారం సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులో రెగ్యులర్ ఫ్యాకల్టీ బోధించడానికి వీల్లేదంటూ వారంతా హన్మకొండ దారిపట్టారు. సోషియాలజీ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ వీసీగా ఉన్నప్పుడు సోషియాలజీ కోర్సును ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ నుంచి కాకతీయ యూనివర్సిటీ మెయిన్ క్యాంపస్‌కు షిఫ్ట్ చేశారు. ఇలా మొత్తం మీద.. నిర్మల్‌కు ఎంతో పేరు తీసుకువచ్చిన సోషియాలజీ కోర్సును తరలించడమే కాకుండా.. పీజీసెంటర్ భవిష్యత్‌నే నాశనం చేశారు.

ఉపాధ్యాయులకు తీపి కబురు

- జిల్లాలో 79 మందికి ప్రమోషన్లు
- నేడో.. రేపో షెడ్యూల్ విడుదల!



నిర్మల్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు తీపి కబురు అందించింది. ప్రభుత్వ పాఠశాలల్లో మరోసారి ప్రమోషన్ల జాతరకు రంగం సిద్ధమవుతోంది. స్కూల్ అసిస్టెంట్‌లకు గెజిటెడ్ హెచ్‌ఎంలుగా, ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు కల్పించేందుకు విద్యాశాఖ కసరత్తు ముమ్మరం చేసింది. నేడో, రేపో షెడ్యూల్ విడుదల చేసేందుకు సమాయత్తమవుతోంది. ఇప్పటికే ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాను జిల్లా అధికారులు ప్రకటించి, వెబ్‌సైట్‌లో ఉంచారు. అభ్యంతరాలు స్వీకరించారు. ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న గజిటెడ్ హెచ్ఎంల పోస్టులు భర్తీ కానున్నాయి. ఆగస్టు 1 నాటికి జిల్లాలో ఖాళీ అయ్యే పోస్టుల ప్రాతిపదికన ప్రమోషన్లు కల్పించాలని సర్కారు నిర్ణయించింది. దీంతో జిల్లాలో 23పీజీ హెచ్‌ఎం, 56స్కూల్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ కానున్నట్లు అధికారులు తెలిపారు. పండిత, పీఈటీ పోస్టులనూ అప్‌గ్రేడ్ చేయనున్నారు.

జిల్లాలో 79 ఖాళీలు

జిల్లాలో 2,975 ఉపాధ్యాయ పోస్టులుండగా 2,323 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఆగస్టు 1వరకు 79 ఖాళీలు ఉండనున్నట్లు అధికారులు లెక్కలు తేల్చారు. పీజీ హెచ్‌ఎం, పీఎస్ హెచ్‌ఎం పోస్టులను 100శాతం, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో 70 శాతం ప్రమోషన్ల కోసం, మరో 30శాతం కొత్త నియామకాల ద్వారా భర్తీ చేస్తారు. ఈ లెక్కన 23మంది పీజీ హెచ్‌ఎంలు, 56మంది స్కూల్ అసిస్టెంట్లకు ప్రమోషన్ లభించవచ్చని విద్యాశాఖ వర్గాల అంచనా. జిల్లాలో పీజీ హెచ్‌ఎం ప్రమోషన్ 23 మందికి దక్కనుండగా.. ఆ మేరకు అదనంగా మరి కొందరికి స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు రానున్నాయి. ఒక్కో పోస్టుకు సీనియార్టీ ఆధారంగా ముగ్గురి పేర్లు సిద్ధం చేస్తారు. ఒక ఉపాధ్యాయుడికి రెండు, మూడు సబ్జెక్టుల్లో ప్రమోషన్ పొందేందుకు అర్హత ఉంటే.. ఒకదాన్ని మాత్రమే ఎంచుకుని దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. గతేడాది ప్రమోషన్లు ఇచ్చినప్పుడు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని కొందరు ఆసక్తి చూపలేదు. మరి కొందరు ప్రమోషన్ పొందినా గడువులోపు చేరలేదు. ఇప్పుడు వారంతా సీనియార్టీ జాబితాలో ముందుంటారు.

కోర్టుకెళ్లే యోచనలో పీజీ హెచ్‌ఎంలు

ప్రమోషన్ల నిర్ణయం తీపి కబురే అయినా.. బదిలీలు లేని ప్రమోషన్లు ఏమాత్రం ఒప్పుకోబోమని పీజీ హెచ్‌ఎంలు స్పష్టం చేస్తున్నారు. గతేడాది పీజీ హెచ్‌ఎంలుగా ప్రమోషన్లు పొంది దూరప్రాంతాల్లో పనిచేస్తుండగా, మొదట బదిలీలు నిర్వహించి ఆ తర్వాతే ప్రమోషన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. లేదంటే కోర్టుకు వెళ్లే యోచనలో ఉన్నట్లు వారు పేర్కొంటున్నారు. కాగా, ప్రమోషన్లు కోరుకునే ఉపాధ్యాయులు ప్రభుత్వం విడుదల చేసే షెడ్యూల్ కోసం ఎదురుచూస్తున్నారు.

మొదట బదిలీలు చేపట్టాలి



బదిలీల తర్వాత ప్రమోషన్లు కల్పించకుంటే కుటుంబాలకు వందల కిలోమీటర్ల దూరంలో పని చేస్తున్న పీజీ హెచ్‌ఎంలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. పీఎస్ హెచ్‌ఎం పోస్టులు ప్రమోషన్లతో భర్తీ చేయాలి.

– దాసరి శంకర్, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ప్రమోషన్లతోపాటు బదిలీలూ..



ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పించడం శుభపరిణామం. కానీ.. మొదట బదిలీలు చేపట్టాలి. లేకుంటే పీజీ హెచ్‌ఎంలు నష్టపోయే ప్రమాదముంది. ప్రభుత్వం పునరాలోచించి షెడ్యూల్ ప్రకటించాలి.

– వేముల సుదర్శన్, తపస్ జిల్లా ప్రధానకార్యదర్శి

అందరికీ 'ఆధార్' ఉండేలా చూడాలి



దస్తురాబాద్: రేషన్‌కార్డు పంపిణీ చేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్, ఎమ్మెల్యే బొజ్జు

- కలెక్టర్ అభిలాష అభినవ్
- అధికారులతో సమీక్షా సమావేశం
- దస్తురాబాద్‌లో రేషన్‌కార్డుల పంపిణీ

నిర్మల్‌చైన్‌గేట్: ప్రతి ఒక్కరికీ ఆధార్‌కార్డు తప్పనిసరి అని కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో ఆధార్ నమోదు ప్రగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధార్ లేని పిల్లల వివరాలు సేకరించి వారికి కార్డులు జారీ చేయాలని సూచించారు. శిశువులు పుట్టిన వెంటనే ఆస్పత్రుల యాజమాన్యాలు తల్లిదండ్రులు ఆధార్ నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. అధిక జనాభా కలిగిన పంచాయతీలను గుర్తించి ఆధార్ కేంద్రాల సంఖ్య పెంచాలని సూచించారు. త్వరలోనే నియోజకవర్గ స్థాయిలో మెగా ఆధార్ సహాయక శిబిరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిశోర్‌కుమార్, యూఐడీఏఐ ఆర్వో ఆఫీస్ హైదరాబాద్ అసిస్టెంట్ మేనేజర్ శోభన్, ఎల్డీఎం రామ్‌గోపాల్, ఈడీఎం నదీం, పోస్టల్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

జిల్లాలోని అటవీ, గిరిజన ప్రాంతాల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అటవీ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ ప్రాంత అభివృద్ధికి మంజూరైన పనులు, లభించిన అటవీ అనుమతులు, చేపట్టిన పనుల పురోగతి గురించి అధికారుల ద్వారా తెలుసుకుని పలు సూచనలు చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిశోర్‌కుమార్, డీఎఫ్‌వో నాగినిభాను, ఆర్డీవో రత్నకళ్యాణి, ఆర్అండ్‌బీ, అటవీ, రెవెన్యూశాఖల అధికా రులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల పంపిణీ

దస్తురాబాద్: మండల కేంద్రంలోని రైతువేదికలో కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మండలానికి 1,352 నూతన రేషన్ కార్డులు మంజూరైనట్లు తెలిపారు. అర్హులు రేషన్‌కార్డు కోసం ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, సీపీవో జీవరత్నం, ఏఎంసీ చైర్మన్ భూషణ్, మండల ప్రత్యేకాధికారి నాగవర్ధన్, డీఎస్వో రాజేందర్, తహసీల్దార్ విశ్వంభర్, ఎంపీడీవో రమేశ్, ఎంపీవో రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు.. ఆదాయం బాగు

- జిల్లాలో రైతులకు అవగాహన
- రాయితీపై మొక్కలు పంపిణీ
- నిర్వహణకు ఏటా రూ.4,200
- ఆసక్తి చూపుతున్న అన్నదాతలు

జిల్లాలో సాగు వివరాలు

సాగు విస్తీర్ణం	8,200
రైతుల సంఖ్య	3,336
కొనుగోలు కేంద్రాలు	8
టన్ను గెలల ధర	రూ.21వేలు



భైంసా మండలం మిర్జాపూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో (ఫైల్)

భైంసాటౌన్: ఆయిల్‌పామ్ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. సాగు విధానం, లాభాలు, నిర్వహణ, రాయితీ తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో వివరిస్తోంది. వరికి ప్రత్యామ్నాయంగా ఈ పంటను సాగు చేసుకోవచ్చని ఉద్యానశాఖ అధికారులు తెలిపారు. వరి, సోయా, పత్తి తదితర పంటలతో పోలిస్తే రెట్టింపు ఆదాయం ఖాయమని చెబుతున్నారు. ఎకరాకు రూ.లక్షకు పైగా ఆదాయం ఆర్జించవచ్చని సూచిస్తున్నారు.

జిల్లాలో 8,200 ఎకరాల్లో సాగు

జిల్లాలో 8,200 ఎకరాల్లో రైతులు ఆయిల్‌పామ్ సాగు చేశారు. 2022–2023 నుంచి సాగు ప్రారంభం కాగా, ప్రస్తుతం పలుచోట్ల పంట చేతికి వస్తోంది. ఇప్పటికే జిల్లాలో సుమారు 200 ఎకరాల్లో పంట కోతకు వచ్చింది. 34 మంది రైతులు దిగుబడులు కూడా జిల్లాలో ఎనిమిది చోట్ల ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించినట్లు ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. పంట విక్రయించిన ఐదురోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ.7.35లక్షలు జమ చేసినట్లు పేర్కొంటున్నారు. ఈసారి జిల్లాలో మరో 4,500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగుకు లక్ష్యం విధించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

రైతులకు రాయితీలు

ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీలు ఇస్తోంది. ఒక ఆయిల్ పామ్ మొక్క రూ.20 చొప్పున ఎకరాకు 50 మొక్కలు అందిస్తోంది. ఎకరాకు ఒక్కసారి రూ.వెయ్యి పెట్టుబడి పెడితే నాలుగేళ్ల తర్వాత పంట కోతకు వస్తుంది. అంతర పంటల సాగు, ఎరువుల కోసం ఎకరాకు ఏటా రూ.4,200 చొప్పున నాలుగేళ్ల దాకా ప్రభుత్వం ఇస్తోంది. ఇక బిందుసేద్యం పథకం కింద 80–100 శాతం రాయితీపై పరికరాలు అందజేస్తోంది. నర్సరీ వద్ద మొక్కల లోడింగ్ చార్జీలు కూడా కంపెనీ భరిస్తోంది. అక్కడి నుంచి మొక్కలు తెచ్చుకునే బాధ్యత రైతులదే. మొక్క నాటిన నుంచి తోటల పరిశీలన, అధిక దిగుబడి కోసం కంపెనీ ప్రతినిధులు రైతులకు సలహాలు, సూచనలు ఇస్తారు. ఎకరంలో వరి సాగయ్యే నీటితో 2.5 ఎకరాల ఆయిల్‌పామ్ సాగు చేయవచ్చు.

ఆయిల్‌పామ్ పరిశ్రమ ఉంటే..

ఆయిల్‌పామ్ సాగును ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తున్నా.. ఆశించిన స్థాయిలో రైతులు ఆసక్తి చూపడం లేదు. నాలుగేళ్ల తరువాత పంట కోతకు రావడం, స్థానికంగా ఆయిల్‌పామ్ పరిశ్రమ లేకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. గత ప్రభుత్వం జిల్లాకో ఆయిల్‌పామ్ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. జిల్లాలోనూ పరిశ్రమ ఏర్పాటుకు భూమిపూజ కూడా చేశారు. కానీ, ఆ తర్వాత పట్టించుకోకపోవడంతో ఎక్కువ మంది రైతులు సాగుపై ఆసక్తి చూపడం లేదు.

సాగుపై అనుమానాలు వద్దు

ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులు ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దు. ఇతర పంటలతో పోలిస్తే అధిక లాభాలు పొందవచ్చు. ఎకరాకు అవసరమైన 50 మొక్కలను రూ.వెయ్యికే అందిస్తున్నాం. నిర్వహణ కోసం ఏడాదికి రూ.4,200 చొప్పున నాలుగేళ్ల దాకా ప్రభుత్వ అందించనుంది. స్థానికంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి దిగుబడులు కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో వెంటవెంటనే డబ్బులు జమ చేస్తోంది. సాగుపై ఆసక్తి కలిగిన రైతులు ఏఈవోలు, ఏవోలు, ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలి.

– బీవీ రమణ, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి

పెన్షన్.. ఊరట

- 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్
- వర్తింపజేయాలని హైకోర్టు తీర్పు
- ఫలించిన టీచర్ల న్యాయ పోరాటం

ఆదిలాబాద్‌టౌన్: 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు హైకోర్టు తీర్పు ఊరటనిచ్చింది. పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ టీచర్ల నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడింది. రెండు దశాబ్దాల తర్వాత సమస్య పరిష్కారానికి నోచుకోవడంతో వారిలో ఆనందం వ్యక్తమవుతోంది. న్యాయస్థాన తీర్పుతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 746 మంది ఉపాధ్యాయులకు ప్రయోజనం చేకూరనుంది. ఇప్పటికే ఉద్యోగ, ఉపాధ్యాయులు సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. అయితే అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2004 సెప్టెంబర్ 1 నుంచి సీపీఎస్ అమలు చేశారు. ఈ నిర్ణయానికి ముందే 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల నియామకం జరిగినప్పటికీ పోస్టింగ్ ఇవ్వకపోవడంతో వీరికి సీపీఎస్ అమలు చేశారు. దీంతో 2019, 2020 సంవత్సరాల్లో పలువురు ఉపాధ్యాయులు కోర్టును ఆశ్రయించి పిటిషన్లు దాఖలు చేశారు. ఎట్టకేలకు వారి పోరాటం ఫలించింది. మంగళవారం హైకోర్టు డీఎస్సీ–2003 టీచర్లకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ఉమ్మడి జిల్లాలో..

డీఎస్సీ 2003లో ఉమ్మడి జిల్లాలో 746 పోస్టులకు అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో ఏజెన్సీ ప్రాంతంలో 317 పోస్టులకు నియామకాలు చేపట్టగా, మైదాన ప్రాంతంలో 429 పోస్టులను భర్తీ చేసింది. ఇందులో ఎస్జీటీ పోస్టులు 372, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 264, భాషా పండిత పోస్టులు 98, పీఈటీ పోస్టులు 12 ఉన్నాయి. ఈ డీఎస్సీ ద్వారా నియామకమైన ఉపాధ్యాయులు ప్రస్తుతం ఉమ్మడి జిల్లా పరిధిలో పనిచేస్తున్నారు. కొంతమంది ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొందారు.

నాటి నుంచి నేటి వరకు..

2003 నవంబర్ 14న డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కాగా, అభ్యర్థులు పరీక్ష రాశారు. ఎంపికైన వారికి 2005 నవంబర్ 23న నియామకాలు చేపట్టారు. మరోవైపు 2004 సెప్టెంబర్ 1 నుంచి సీపీఎస్ అమలులోకి వచ్చింది. ప్రభుత్వం నియామకాలు చేపట్టిన నుంచి సీపీఎస్ అమలవుతుందని చెప్పడంతో వీరికి ఇప్పటివరకు అదే అమలు చేశారు. అయితే 2019లో వీరితో నియామకమైన న్యాయశాఖ ఉద్యోగులు కోర్టును ఆశ్రయించగా వారికి అనుకూలమైన తీర్పు వచ్చింది. ఆ తీర్పు పత్రాలతో కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా తమకు కూడా పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని న్యాయస్థానం తీర్పు ఇచ్చినట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి పెద్దపీట



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

దిలావర్‌పూర్: ప్రజాసమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తున్నట్లు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం రేషన్ కార్డులు పంపిణీ చేశారు. సిర్గాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద సిర్గాపూర్ నుంచి వయా కాల్వ తండా మీదుగా కాల్వ అటవీ ప్రాంతంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు రూ.కోటి 91లక్షలతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. దిలావర్‌పూర్ పీహెచ్‌సీ పరిసరాల్లో రూ.16 లక్షలతో చేపట్టిన ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. దిలావర్‌పూర్ తండా నుంచి బన్సపల్లి వరకు రూ.2.56 కోట్లతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిర్మల్ ఆర్డీవో రత్న కళ్యాణి, తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్, నాయకులు రమణారెడ్డి, సుజాత మేర్వాన్, గంగవ్వ ముత్యంరెడ్డి, సత్యం చంద్రకాంత్, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల దిలావర్‌పూర్‌లో అనారోగ్యంతో మరణించిన ఎనుగంటి ముత్తవ్వ, కుంట చిన్నయ్య కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు.

క్లుప్తంగా

రెండు కిలోల గంజాయి పట్టివేత

వాంకిడి: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వాంకిడి మండలం ఇందాని ఎక్స్‌రోడ్ వద్ద బుధవారం ఉదయం పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా మహారాష్ట్ర వైపు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరు వ్యక్తులు గంజాయితో పట్టుబడ్డారు. రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

పొన్నారిలో అర్ధరాత్రి చోరీ



సీసీ కెమెరాల్లో రికార్డయిన దొంగల కదలికలు

తాంసి: మండలంలోని పొన్నారి గ్రామంలో మంగళవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడి, మరో ఇంట్లో కూడా చోరీకి యత్నించగా కుటుంబసభ్యులు అలర్ట్ కావడంతో పారిపోయారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో దుండగులు గ్రామానికి చెందిన తొడసం అనిల్ ఇంట్లో చోరీకి పాల్పడి రూ.4,500 నగదు, రెండు సెల్ ఫోన్లను ఎత్తుకెళ్లారు. మరో వ్యక్తి ఆవుల ఊశన్న ఇంట్లో చోరీకి యత్నించగా కుటుంబసభ్యులు కేకలు వేయడంతో పారిపోయారు. ఇంటి బయట ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించగా ముగ్గురు దొంగల కదలికలు కనిపించాయి. పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేయగా ఏఎస్సై దిలీప్, సిబ్బందితో అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు.

గొల్లవాగు ప్రాజెక్టులో వ్యక్తి మృతదేహం



లక్ష్మణ్(ఫైల్)

జైపూర్: భీమారం మండలం గొల్లవాగు ప్రాజెక్టు సమీపంలో రాజులగుట్ట వద్ద ఓ వ్యక్తి మృతదేహాన్ని బుధవారం పశువులకాపరి గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక ఎస్సై శ్వేత పరిశీలించి విచారణ చేపట్టారు. చెన్నూర్ మండలం కిష్టంపేటకు చెందిన భీమిని లక్ష్మణ్ గుర్తించారు. మృతదేహం కుళ్లిపోవడంతో అక్కడే పోస్ట్‌మార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై తెలిపారు.

కబడ్డీ ఆడుతుండగా విద్యార్థికి గాయాలు

శ్రీరాంపూర్: నస్పూర్ గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో తొమ్మిది తరగతి విద్యార్థి చరణ్ గాయపడ్డాడు. బుధవారం పాఠశాలలో కబడ్డీ ఆడుతుండగా ప్రమాదవశాత్తు పడిపోవడంతో కాలు విరిగింది. పాఠశాల సిబ్బంది మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. చరణ్‌ను పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డీ.శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అభినవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సన్నీగౌడ్, నాయకులు మిట్టపల్లి తిరుపతి, సుమంత్ పరామర్శించారు. విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

దండేపల్లి: మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన శాతరాజు ఆశయ్యకు చెందిన ఆవు బుధవారం విద్యుదాఘాతంతో మృతిచెందింది. రెండు గేదెలు, ఆవును మేపేందుకు పొలాల వైపు తీసుకెళ్లగా.. ఆవు విద్యుత్ స్తంభానికి తగిలి కింద పడింది. విద్యుత్ వైరు ఊడి పడి స్తంభానికి తగిలి విద్యుదాఘాతంతో మృతిచెందినట్లు నిర్ధారించారు. ఆవు విలువ రూ.80వేలు ఉంటుందని, పరిహారం అందించాలని బాధిత రైతు వేడుకుంటున్నాడు.

7, 8 తేదీల్లో రాష్ట్రస్థాయి యోగాసన పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

ఆదిలాబాద్: వచ్చేనెల 7, 8 తేదీల్లో జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి సీనియర్ యోగాసన ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు యోగాసన అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పతంజలి యోగా శిక్షణ కేంద్రంలో పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మావలలోని రత్నగార్డెన్‌లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. ట్రెడిషనల్ యోగాసన, ఫార్వర్డ్ బెండింగ్, బ్యాక్ బెండింగ్, ట్విస్టింగ్, లెగ్ బ్యాలెన్స్, హ్యాండ్ బ్యాలెన్స్, ఆర్టిస్టిక్, రిథమిక్ యోగాసన కేటగిరీల్లో పోటీలు ఉంటాయని వెల్లడించారు. 18–28, 28–25, 35–45, 45–55 వయస్సుల విభాగాల్లో క్రీడాకారులు పోటీ పడవచ్చని తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారు సెప్టెంబర్ 9 నుంచి 13 వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దుర్గ్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు ఎంపికవుతారని పేర్కొన్నారు. వివరాలకు 9949223912, 9573868783 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఇందులో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అన్వేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి సీఎస్ చేతన్, సంతోష్ తదితరులున్నారు.

ఏమైందో.. ఏమో!

- 'రిమ్స్' వైద్య విద్యార్థి బలవన్మరణం
- వసతిగృహంలో ఉరేసుకుని ఆత్మహత్య
- విషాదంలో తోటి విద్యార్థులు



మాట్లాడుతున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్



మార్చురీ వద్ద తోటి మెడికోలు

ఆదిలాబాద్‌టౌన్: రోగుల ప్రాణాలు కాపాడేందుకు వైద్యవృత్తి ఎంచుకొని ఎంబీబీఎస్ చదువుతున్న ఓ మెడికో బలవన్మరణానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందిన సాహిల్ చౌదరి (20) రిమ్స్‌లో ఎంబీబీఎస్ సెకండియర్ చదువుతున్నాడు. బుధవారం వసతిగృహంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాహిల్ ఆలిండియా కోటాలో ర్యాంకు సాధించి ఇక్కడ ఎంబీబీఎస్‌లో చేరాడు. చిన్నప్పటి నుంచి చదువులో ముందుండేవాడు. ఫస్టియర్ పరీక్షల్లోనూ ఉత్తీర్ణుడయ్యాడు. అందరితో కలుపుగోలుగా ఉండే ఈ మెడికో అఘాయిత్యానికి పాల్పడడంతో తోటి విద్యార్థులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. విషయాన్ని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ మృతుడి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారు జైపూర్ నుంచి బయల్దేరారు. ప్రస్తుతం మృతదేహం రిమ్స్ మార్చురీలో ఉంది. టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అఘాయిత్యం..



సాహిల్ చౌదరి (ఫైల్)

సాహిల్ స్వస్థలం రాజస్థాన్‌లోని జైపూర్. తండ్రి అర్బుల్ చౌదరి ఉపాధ్యాయుడు. రిమ్స్‌లో చదువుతున్న ఈ మెడికో వసతిగృహంలో గల 125 రూమ్‌లో ముగ్గురు విద్యార్థులతో కలిసి ఉంటున్నాడు. రోజులాగే వారు బుధవారం తరగతులకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. టిఫిన్ తర్వాత వెళ్దామని ఫ్రెండ్స్ చెప్పారు. అయితే తన తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడి వస్తానని చెప్పడంతో స్నేహితులు లైబ్రేరీకి వెళ్లారు. ఆ తర్వాత స్నేహితులు 11.48 గంటలకు సాహిల్‌కు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. దీంతో పక్క గదిలో ఉండే సీనియర్‌కు ఫోన్ చేసి తమ స్నేహితుడు ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని తెలిపారు. దీంతో ఆయన వసతిగృహంలోని గదికి వెళ్లాడు. తలుపులు తట్టినా తీయకపోవడంతో విషయాన్ని వారికి తెలియజేశాడు. కిటికిలో నుంచి చూడగా గదిలోని ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతున్నాడు. మరికొంత మందితో కలిసి తలుపు పగలగొట్టి లోనికి వెళ్లారు. కిందికి దించి రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు సీపీఆర్ చేసినా ఫలితం దక్కలేదు. మృతిచెందినట్లు మధ్యాహ్నం 12.45 గంటలకు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ అక్కడికి చేరుకున్నారు. తోటి విద్యార్థుల ద్వారా వివరాలు తెలుసుకున్నారు. అయితే మృతికి గల కారణాలు తెలియరాలేదు. పోలీసులకు సమాచారం అందించారు. ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకునేందుకు హెచ్‌వోడీలతో సమావేశం నిర్వహించారు. 8 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశారు. వసతిగృహంలోని విద్యార్థులతో పాటు ఇతర సిబ్బంది ద్వారా వివరాలు తెలుసుకుంటున్నారు.

మృతదేహాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, అడిషనల్ కలెక్టర్..

మెడికో మృతి విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే శంకర్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో స్రవంతి, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ రిమ్స్‌కు చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించారు. తోటి విద్యార్థులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని రాజస్తాన్‌కు పంపేలా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే రిమ్స్ డైరెక్టర్‌కు సూచించారు. అనంతరం రిమ్స్ వైద్యులు, విద్యార్థులతో అదనపు కలెక్టర్ వేర్వేరుగా సమావేశం అయ్యారు. ఆత్మహత్యకు గల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కంటతడి పెట్టిన తోటి విద్యార్థులు..

మెడికో ఆత్మహత్యకు పాల్పడడంతో తోటి విద్యార్థులు కంటతడి పెట్టారు. ఈ ఘటనతో రిమ్స్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా మృతుడి తల్లిదండ్రులు జిల్లా కేంద్రానికి వచ్చాక పోస్టుమార్టం నిర్వహించనున్నారు. అయితే పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఈ సంఘటనతో మనోవేదనకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా ఆత్మహత్యకు ముందు తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడిన సాహిల్ చౌదరి పేరెంట్స్ జిల్లా కేంద్రానికి వచ్చిన తర్వాత ఘటనకు సంబంధించి వివరాలు తెలిసే అవకాశం ఉంది.

జీవో 49 రద్దుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలి

- ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్



పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ నగేశ్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ప్రాంతాల్లోని 339 గ్రామాలను టైగర్ రిజర్వ్‌గా మార్చాలని తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.49ను రద్దు చేయాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. విషయాన్ని బుధవారం ఆయన పార్లమెంట్ సమావేశంలో ప్రస్తావించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో స్థానిక గిరిజనులు, గిరిజనేతరుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిందని తెలిపారు. ఈ నిరసనల కారణంగా తెలంగాణ ప్రభుత్వం జీవో అమలును తాత్కాలికంగా నిలిపివేసిందని పేర్కొన్నారు. అయితే ఈ విషయంలో ప్రభుత్వం బాధ్యత తీసుకోకుండా, ఈ జీవో కేంద్రం జారీ చేసిందని తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. బాధిత గ్రామాల ప్రజల హక్కులు, జీవనోపాధిని కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చి జీవోను పూర్తిగా ఉపసంహరించుకునేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు.

విద్యార్థిని మృతిపై ఆందోళన

- కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- కళాశాల సీజ్ చేయాలని ప్రజా, విద్యార్థి సంఘాల ఆందోళన



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ ప్రమోద్‌రావు

మంచిర్యాలక్రైం: విద్యార్థిని కొత్తపల్లి సహస్ర కుటుంబానికి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు బుధవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. లక్సెట్టిపేటకు చెందిన సహస్ర (18) మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రైవేటు కళాశాల, వసతిగృహం మూడో అంతస్తు నుంచి పడి మృతిచెందిన విషయం తెలిసిందే. బుధవారం ప్రభుత్వ ఆస్పత్రి వద్ద, స్థానిక ఐబీ చౌరస్తాలో ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు భారీ సంఖ్యలో బైఠాయించారు. ఇరువైపుల వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా దారి మళ్లించారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, రూ.50లక్షలు నష్టపరిహారం చెల్లించాలని ఆయా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మృతికి కారణమైన కళాశాల యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అనుమతి లేని కళాశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కుటుంబ సభ్యులు, ఆందోళనకారులతో స్థానిక సీఐ ప్రమోద్‌రావు మాట్లాడి బాధితుల ఫిర్యాదు మేరకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని హామీనిస్తూ ఇరువర్గాలతో చర్చలు జరిపారు. కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తామని కళాశాల యాజమాన్యం హామీనివ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ప్రమోద్‌రావు తెలిపారు.

అడవిపంది దాడిలో గాయపడిన మహిళ మృతి



దుబ్బుల లక్ష్మి(ఫైల్)

చింతలమానెపల్లి(సిర్పూర్): చింతలమానెపల్లి మండలం బాలాజీ అనుకోడ గ్రామానికి చెందిన దుబ్బుల లక్ష్మి(55) అనే మహిళ అడవి పంది దాడిలో గాయపడి మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బుల లక్ష్మి గత శనివారం బాలాజీ అనుకోడ శివారులోని తన వ్యవసాయ భూమిలోకి పనికి వెళ్లింది. ముగించుకుని ఇంటికి వస్తుండగా అడవిపంది దాడి చేసి గాయపర్చింది. కుటుంబ సభ్యులు స్థానికంగా ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని సిర్పూర్(టి) సామాజిక ఆస్పత్రి తరలించారు. అటవీశాఖ అధికారులు, పోలీసులకు సమాచారం అందించారు.

బావిలో పడి వృద్ధుడు మృతి



రాజలింగు(ఫైల్)

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధి ఇటిక్యాల గ్రామానికి చెందిన కొత్త రాజలింగు(76) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. స్థానిక ఎస్సై గోపతి సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజలింగు గత కొద్ది రోజులుగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. మందులు వాడినా నయం కాలేదు. ఈ నెల 29న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం ఇంటి సమీపంలోని బావిలో మృతదేహం లభ్యమైంది. మృతుడి కూతురు పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య



ప్రియాంక (ఫైల్)

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన వివాహిత పెంటోళ్ల ప్రియాంక (23) మంగళవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు, ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ముత్తన్నతో చుచుంద్ గ్రామానికి చెందిన ప్రియాంకకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. ముత్తన్న కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భార్య ఫోన్ ఎక్కువగా వినియోగిస్తుండడంతో ముత్తన్న మంగళవారం మందలించి బయటకు వెళ్లిపోయాడు. దీంతో క్షణికావేశానికి లోనైన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరెతో ఉరేసుకుని ఆత్మహత్య వేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త ముత్తన్న ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. రెండేళ్లలోపు ఇద్దరు పిల్లలున్నారు.

చిన్నారిపై కోతుల దాడి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఉదయ్‌నగర్‌లో చిన్నారి రష్మికపై కోతులు దాడి చేశాయి. బుధవారం తల్లి, చిన్నమ్మతో కలిసి ఇంటి వద్ద నడుచుకుంటూ వస్తుండగా కోతుల గుంపు ముగ్గురిపై దాడి చేశాయి. మిగతా ఇద్దరికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు. కోతుల దాడిలో చిన్నారి రష్మిక చేతులపై గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.

ఇసుక ట్రాక్టర్ పైనుంచి పడి మహిళ మృతి



తులసి(ఫైల్)

నెన్నెల: ఇసుక ట్రాక్టర్ పైనుంచి కిందపడి మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు పెద్దలం బాడితండాకు చెందిన దరావత్ తులసి(శంకరమ్మ)(28) బుధవారం బెల్లంపల్లికి ఇసుక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ఎక్కి బ్యాంకు పనిమీద నెన్నెలకు బయలుదేరింది. ఇంజన్ ట్రాలీ మధ్యలో ఉన్న లింక్‌పై నిలబడి ఉండడంతో కంబాలకుంట మూలమలుపు వద్దకు వెళ్లగానే డ్రైవర్ సడెన్‌బ్రేక్ వేయడంతో కిందపడిపోయింది. ట్రాక్టర్ ట్రాలీ టైర్లు ఆమె తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ట్రాక్టర్ డ్రైవర్ మితిమీరిన వేగం, అజాగ్రత్త కారణంగానే తులసి మృతి చెందిందని బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఈ ప్రమాదానికి కారణమైన డ్రైవర్ కుడిమెత లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి భర్త రాజ్‌కుమార్, కుమారుడు, కూతురు ఉన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి ఏడాది జైలు

ఆదిలాబాద్‌టౌన్: హత్యాయత్నం కేసులో నిందితుడికి యేడాది జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి కే.ప్రభాకరరావు తీర్పునిచ్చారు. లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. గుడిహత్నూర్ మండలం మన్నూరు గ్రామానికి చెందిన సిందే రాహుల్‌కు అదే గ్రామానికి చెందిన ముర్కుటే సాయినాథ్‌కు మధ్య తరచూ ఇంటి స్థలం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో 2023 సెప్టెంబర్ 7న ఉదయం రాహుల్‌పై సాయినాథ్ కొడవలితో దాడి చేసి గాయపర్చాడు. బాధితుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదైంది. కోర్టు డ్యూటీ అధికారి రవీందర్ పది మంది సాక్షులను కోర్టులో హాజరుపర్చగా, పీపీ రహీమ్ నేరం రుజువు చేశారు. సాయినాథ్‌కు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి తీర్పునిచ్చారు.

విగ్రహాల పునఃప్రతిష్ఠ మహోత్సవం



ఆలయంలో అర్చకులు, వేదపండితులు

బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయం ఆధ్వర్యంలో గోదావరి నది తీరానగల సూర్యేశ్వర, శివాలయాల్లో విగ్రహాల పునఃప్రతిష్ఠ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నాగోబా హుండీ ఆదాయం రూ.1.35 లక్షలు



హుండీ లెక్కిస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: నాగుల పంచమి పురస్కరించుకుని నాగోబా ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీని మెస్రం వంశీయులు బుధవారం లెక్కించారు. రూ.లక్ష 35వేలు ఆదాయం సమకూరినట్లు ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు. ఇందులో మెస్రం పెద్దలు కోసేరావ్, దేవ్‌రావ్, నాగ్‌నాథ్, సీతారాం పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో మొదటిసారి గ్లోబల్ కోటా సీట్లన్నీ భర్తీ

బాసర: ఆర్జీయూకేటీ బాసర, మహబూబ్‌నగర్ కళాశాలల్లో గ్లోబల్ కోటా సీట్ల భర్తీకి బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించగా వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. 2016 నుంచి ఏటా గ్లోబల్ కోటా సీట్లు మిగిలిపోయేవని, ఈసారి మొదటిసారిగా పూర్తిస్థాయిలో భర్తీ కావడం విశేషమని పేర్కొన్నారు. 118 గ్లోబల్ కోటా సీట్లలో బాసర క్యాంపస్‌లో 105, మహబూబ్‌నగర్‌లో 13 సీట్లు భర్తీ అయినట్లు తెలిపారు. కన్వీనర్లు, కోకన్వీనర్లు, అడ్మిషన్ విభాగం సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీసీడీపీ నిధులు విడుదల చేయాలి

ఆదిలాబాద్: సీసీడీపీ నిధులు వెంటనే విడుదల చేయాలని కోలాం సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి గోవింద్‌రావు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీసీడీపీ నిధుల మంజూరులో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కోలాం, తోటి వంటి పీవీటీజీల ఇళ్లు, వివిధ పథకాల బిల్లులు ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక శాఖలో ఉన్న పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని కోరారు. ఇదే విషయమై ప్రజాపాలన నోడల్ అధికారి, ఆర్థిక శాఖ కమిషనర్, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్, కలెక్టర్, ఐటీడీఏ పీవోలకు సైతం వినతి పత్రాలు అందజేశామని వివరించారు. అయినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదని పేర్కొన్నారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు ఆత్రం ముకుందరావు, కుద్మేత తిరుపతి, టేకం దిలీప్, మర్సుకొల బాపూరావు, జైరాం, మడావి అనిత తదితరులున్నారు.

పాముకాటుకు బాలుడు బలి



మొగిళి శ్యాం మృతదేహం

రెబ్బెన: అభంశుభం తెలియని ఓ బాలుడు పాముకాటుకు బలయ్యాడు. అప్పటివరకు తల్లిదండ్రులు, తోబుట్టువుతో ఆడిపాడి పడుకున్న బాలుడిని తలగడ కింద ఉన్న పాము కాటువేసింది. ఈ ఘటన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. రెబ్బెన మండలం లక్ష్మిపూర్ పంచాయతీ పరిధి గొల్లగూడకు చెందిన మొగిలి చిన్నన్న, అనూషకు ఇద్దరు కుమారులు. పెద్దవాడైన మొగిలి శ్యాం(4) మంగళవారం రాత్రి తల్లి దండ్రులతో కలిసి ఇంట్లో నేలపై పడుకున్నాడు. రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో చెవి నొప్పిగా ఉందంటూ ఏడుస్తూ నిద్ర లేచాడు. తల్లిదండ్రులు మొదట చెవిపోటుగా భావించారు. ఎంతకీ ఏడుపు ఆపకపోవడంతో సమీపంలో ఉంటున్న వారి బంధువు శ్రీశైలంకు సమాచారం అందించారు. ఈ క్రమంలో చిన్నన్న, అనూష తలగడ కింద కట్లపామును గుర్తించారు. శ్రీశైలం పరిశీలించి చూడగా శ్యాం చెవిపై పాము కాటు గాయం కనిపించింది. దీంతో తల్లిదండ్రులు హుటాహుటిన శ్యాంను బైక్‌పై రెబ్బెన పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ఆస్పత్రి సిబ్బంది బాలుడి రక్త నమూనా సేకరించి బెల్లంపల్లికి వెళ్లాలని సూచించారు. అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో తల్లిదండ్రులే మళ్లీ బైక్‌పై బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. అప్పటికే శ్యాం పరిస్థితి విషమంగానే ఉండడంతో మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తీసుకెళ్లాలని రెఫర్ చేశారు. మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి అంబులెన్స్‌లో తీసుకెళ్లగా, అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. బాలుడి తండ్రి చిన్నన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

కనీస వైద్యం అందించలేదు..

పాముకాటు వేసిందని రెబ్బెన పీహెచ్‌సీకి వస్తే కనీస వైద్యం అందించకుండా బెల్లంపల్లికి వెళ్లాలని చెప్పడంతోనే శ్యాం ప్రాణాలు కోల్పోయాడని కుటుంబ సభ్యులు తెలిపారు. డ్యూటీలో ఉన్న నర్సు బ్లడ్ శాంపిల్ మాత్రమే తీసుకుని, ఎలాంటి ఇంజక్షన్ వేయకుండా త్వరగా బెల్లంపల్లికి వెళ్లాలని సూచించారని ఆరోపించారు. ఆస్పత్రి వద్ద అంబులెన్స్ కూడా అందుబాటులో లేకపోవడంతో బైక్‌పై తీసుకెళ్లాల్సి వచ్చిందని తెలిపారు. రెబ్బెన పీహెచ్‌సీలో సరైన వైద్యం అందిస్తే బాబు బతికేవాడని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంజక్షన్ తెచ్చేలోపే వెళ్లిపోయారు : పీహెచ్‌సీ వైద్యాధికారి సుజిత్

పీహెచ్‌సీకి వచ్చేవారికి సాధ్యమైనంత వరకు నాణ్యమైన సేవలు అందించేందుకే చూస్తాం. మంగళవారం రాత్రి అపస్మారక స్థితిలో ఉన్న బాలుడిని తీసుకుని అతడి తల్లిదండ్రులు పీహెచ్‌సీకి వచ్చారు. డ్యూటీలో ఉన్న నర్సు బాలుడిని పరీక్షించారు. పాముకాటు కన్‌ఫార్మ్ చేసుకున్నాక.. బ్లడ్ శాంపిల్ తీసి యాంటీవీనమ్ ఇంజక్షన్ లోడ్ చేసుకుని వచ్చేసరికే బాలుడిని తీసుకుని తల్లిదండ్రులు వెళ్లిపోయారు. అంతే తప్పా బాలుడికి వైద్యం చేసే విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం చేయలేదు.

సైబర్ నేరగాళ్ల ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న మంచిర్యాల డీసీపీ భాస్కర్

- జన్నారం కేంద్రంగా కార్యకలాపాలు
- కాంబోడియా దేశం నుంచి సూచనలు
- వివరాలు వెల్లడించిన డీసీపీ భాస్కర్

జన్నారం: జన్నారం కేంద్రంగా సైబర్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి సైబర్ నేరాలకు వినియోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలను మంచిర్యాలలో డీసీపీ భాస్కర్ తన కార్యాలయంలో బుధవారం వెల్లడించారు. జగిత్యాల జిల్లా లక్ష్మీపూర్(వీ) గ్రామానికి చెందిన భావు బాపయ్య 2024 జూలైలో కాంబోడియా దేశానికి వెళ్లి రెస్టారెంట్‌లో పనికి కుదిరాడు. బాపయ్యకు కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం వేదాంతపురం గ్రామానికి చెందిన పాలవల్సుల సాయికృష్ణ ఉరఫ్ జాక్ ఉరఫ్ రాజు విదేశాలకు వెళ్లేందుకు వీసా కోసం ప్రయత్నిస్తుండగా 2023లోనే ఛండీఘర్‌లో పరిచయం అయ్యాడు. 2024లో సాయికృష్ణ కాంబోడియా వెళ్లి బాపయ్యను రెస్టారెంట్‌లో కలిశాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో బాపయ్య ఇండియాకు తిరిగి వచ్చాడు. ఓ రోజు వాట్సాప్‌లో బాపయ్యను సాయికృష్ణ సంప్రదించి.. జన్నారం ప్రాంతంలో తనకు ఒక అద్దె ఇల్లు కావాలని కోరాడు. దీనికి బాపయ్య తన చెల్లెలి భర్త, జన్నారం మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన గొట్ల రాజేశ్‌తో కలిసి కలమడుగు గ్రామంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నారు. ఈ ఏడాది మేలో సాయికృష్ణ వాట్సాప్‌లో బాపయ్యను సంప్రదించి.. ఓ వ్యక్తి ద్వారా సామగ్రి పంపిస్తున్నానని, దానిని జగిత్యాల బస్టాండ్‌కు వెళ్లి తీసుకుని అద్దె గదిలో ఉంచాలని సూచించాడు. ఆ సమయంలో బాపయ్య అందుబాటులో లేకపోవడంతో అతడి తమ్ముడు మధుకర్ సామగ్రిని తీసుకెళ్లి కలమడుగులోని అద్దె గదిలో ఉంచారు. తర్వాత నెట్ కనెక్షన్, ఇన్వర్టర్, ల్యాప్‌టాప్ సమకూర్చుకున్నారు. తాను చెప్పినట్లు చేయాలని, ఇందుకు నెలకు రూ.30వేల చొప్పున ఇస్తానని, పైగా వచ్చిన సొమ్ములో వాటా కూడా ఇస్తానని బాపయ్య, మధుకర్, గొట్ల రాజేశ్‌ను సాయికృష్ణ పనికి కుదుర్చుకున్నాడు. వీరితోపాటు అప్పటికే ఆన్‌లైన్ గేమ్స్ ఆడి రూ.లక్షలు పోగొట్టుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మన్యం జిల్లా పార్వతీపురానికి చెందిన యాండ్రాపు కామేశ్‌ను నెలకు రూ.70వేల జీతం, వాటా ఇస్తానని ఉద్యోగానికి కుదుర్చుకున్నాడు. కామేశ్‌కు ఢిల్లీలోని ఐవీల్స్ కంపెనీలో డీజిల్ సేల్స్‌లో అకౌంట్ కీ మేనేజర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. ఈ క్రమంలో బాపయ్య, మధుకర్, గొట్ల రాజేశ్, కామేశ్ కలిసి అద్దె గదిలో డీలింక్ రూటర్లు, ల్యాప్‌టాప్, సిమ్ ప్యానల్ ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలు ప్రారంభించారు. ఆధారాలు లేని సిమ్‌కార్డులు 350 కొనుగోలు చేశారు. సాయికృష్ణ టెలిగ్రాం యాప్ ద్వారా చెప్పినట్లు ఈ నలుగురు ప్యానెల్‌లో సిమ్‌లు అమర్చి, కొంత సమయం తర్వాత తీయడం, కొత్త సిమ్‌లు పెట్టడం చేస్తూ ఉండేవారు. సిమ్‌బాక్స్ పరికరాలు ఏర్పాటు చేసి వివిధ రకాలైన ఐఎంఈఐ నంబర్లు, లింకులు తయారు చేసి సైబర్ నేరాలు పాల్పడుతూ అమాయక ప్రజలను మోసం చేసేందుకు యత్నిస్తున్నారు.

పట్టుబడింది ఇలా..

ఢిల్లీకి చెందిన టెలి కమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్ సాంకేతిక పరిజ్ఞానంతో వీరి బండారాన్ని గుర్తించింది. రామగుండం సైబర్ క్రైం, పోలీసులు టెక్నికల్ సహాయంతో బుధవారం కలమడుగు చేరుకుని సోదాలు నిర్వహించారు. సోదాల్లో కామేశ్, భావు బాపయ్య, మధుకర్, గొట్ల రాజేశ్ పట్టుబడ్డారు. వారిని అరెస్ట్ చేసి సైబర్ నేరాలకు వినియోగించే పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. జాతీయ, అంతర్జాతీయ కాల్స్ లింక్స్ ఉన్నందున లోతైన విచారణ చేస్తున్నామని డీసీపీ వివరించారు. నిందితులను పట్టుకున్న మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, సైబర్ క్రైం డీసీపీ వెంకటరమణరెడ్డి, లక్సెట్టిపేట సీఐ రమణమూర్తి, టెలికమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ అలెన్, అనురాగ్, సైబర్ క్రైమ్ సీఐలు కృష్ణమూర్తి, శ్రీనివాస్, ఎస్సైలు గొల్లపెల్లి అనూష, సురేశ్, తహసీనోద్దీన్‌ను రామగుండం సీపీ, మంచిర్యాల డీసీపీ అభినందించారు.